# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 23 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## ఢిల్లీకి బయల్దేరిన సీఎం రేవంత్..



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి బయల్దేరారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ హైకమాండ్ తో కీలక చర్చలు జరపనున్నారు. మంత్రిమండలి కూర్పుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు మిగిలిన నామినేటెడ్ పదవుల పంపకం, కొత్త పీసీసీ చీఫ్‌తో పాటు పార్టీలో కీలక పదవుల నియామకంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే మరో వారం రోజుల్లో కొత్త మంత్రుల ప్రమాణం ఉండొచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. కాగా, సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ ఉన్నారు.

# ధర్నాలతో
# దద్దరిల్లిన తెలంగాణ

**రైతు రుణమాఫీ కోసం బీఆర్ఎస్ పోరు బాటపట్టింది. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా గురువారం ధర్నాలు చేపట్టింది. రాష్ట్ర రైతాంగానికి బాసటగా నిలవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు కదంతొక్కారు. అన్ని మండల కేంద్రాల్లో రైతుల కలిసి పార్టీ కార్యకర్తలు ధర్నాలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని, ఆంక్షల్లేకుండా రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. చేవెళ్లలో జరిగే ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు.**





- ఆంక్షల్లేకుండా రుణమాఫీ చేయాలి
- అందరికీ రుణమాఫీ కాకుంటే తొండలను వదులుతాం
- రేవంత్‌కు దమ్ముంటే ఎలాంటి సెక్యూరిటీ లేకుండా గ్రామాల్లోకి రావాలని
- రుణమాఫీ జరిగిందో లేదో అడుగుదాం
- రైతు సమస్యలపై మా పోరుకి ఇది ఆరంభం
- బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి కూడా..
- చేవేళ్ల బీఆర్ఎస్ రైతు రుణభేరిలో కేటీఆర్

బలగం టీవీ, చేవెళ్ల

రైతు రుణమాఫీ నుంచి సర్కార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ. 2 లక్షలు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేవెళ్లలో నిర్వహించిన ఈ ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డికి మరోసారి సవాల్ విసిరారు. రేవంత్‌కు దమ్ముంటే ఎలాంటి సెక్యూరిటీ లేకుండా గ్రామాల్లోకి రావాలని ఆహ్వానించారు. రుణమాఫీ జరిగిందో లేదో గ్రామాల్లోకి వెళ్లి అడుగుదామని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. రైతు రుణమాఫీ చెయ్యకపోతే నీ లాగుల్లో తొండలు వదిలి రుణమాఫీ అయ్యేదాకా వదిలిపెట్టం' అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదని.. భారత రైతు సమితి కూడా అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని.. అంతం కాదని కాంగ్రెస్ ప్రభుత్వానికి వార్నింగ్ ఇచ్చారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను వెండపడుతామన్నారు. రైతు రుణమాఫీ అని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నశించాలని, సీఎం డౌన్ డౌన్ అంటూ కేటీఆర్ నినదించారు. మూడు రోజుల క్రితం

మిగితా 2వ పేజీలో

# వ్యవసాయ రంగం అభివృద్ధికి ఇక్రిశాట్ సహకారం



- **అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలపై పరిశోధనలు ముమ్మరం చేయండి**
- **ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ జాక్వెలిన్ హ్యూతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ రకాల పంటలకు సంబంధించి అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలపై పరిశోధనలను ముమ్మరం చేయాలని ప్రతిష్టాత్మక ఇక్రిశాట్ సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణలో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందేలా పరిశోధనలు సాగాలన్నారు. అంతర్జాతీయ పంటల పరిశోధన సంస్థ ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలిన్ హ్యూ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్ర వ్యవసాయ రంగం అభివృద్ధి, కొత్త వంగడాలపై పరిశోధనలు తదితర సమాలోచనల నేపథ్యంలో ఇక్రిశాట్ సంస్థను సందర్శించాల్సిందిగా డైరెక్టర్ జనరల్ జాక్వెలిన్ హ్యూ గారు ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. అందుకు అంగీకరించిన సీఎం త్వరలోనే ఇక్రిశాట్ క్యాంపస్ ను సందర్శిస్తానని తెలిపారు. భేటీలో పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

1972లో హైదరాబాద్ కేంద్రంగా ఏర్పడిన ఇక్రిశాట్ (ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమీ-ఎరిడ్ ట్రాపిక్స్) కొత్త వంగడాల పరిశోధనల్లో ప్రపంచానికే మార్గదర్శక సంస్థగా కొనసాగుతోంది. ఇక్రిశాట్ కొలువైన తెలంగాణలోనూ ఆ సంస్థ సేవలను విస్తృతం చేయడం ద్వారా రాష్ట్ర వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## సుప్రీం కోర్టు హామీతో
# సమ్మె విరమించిన వైద్యులు



బలగం టీవీ, న్యూఢిల్లీ

సుప్రీంకోర్టు జోక్యంతో కోల్‌కతా హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళనలు చేపడుతున్న వైద్యులు సమ్మె విరమించారు. కొన్ని చోట్ల వెంటనే వైద్యులు విధుల్లోకి చేరగా, మరికొన్ని చోట్ల శుక్రవారం ఉదయం నుంచి సేవలు అందించనున్నారు.

: కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న వైద్యులు ఎట్టకేలకు తమ సమ్మెను విరమించారు. విధుల్లోకి చేరాలని కోరడం, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూస్తామని సుప్రీంకోర్టు హామీలు ఇచ్చిన క్రమంలో తమ సమ్మెను విరమిస్తున్నట్లు వైద్యులు ప్రకటించారు. ఆగస్టు 23వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

"మా డిమాండ్లతోపాటు ఆందోళనలను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్న నేపథ్యంలో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటిస్తున్నాం. మా విధులన్నింటినీ తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాం" అంటూ రెసిడెంట్ డాక్టర్ అసోసియేషన్, డా.ఆర్ఎంఎల్ హాస్పిటల్ ప్రకటనను విడుదల చేసింది. 11 రోజులుగా సమ్మె నిర్వహించామని, కోర్టులు జోక్యం చేసుకోవడం ఉపశమనం కలిగించిందని ఆర్‌డీఏ ఎయిమ్స్ ఢిల్లీ జనరల్ సెక్రటరీ డాక్టర్ రఘునందన్ దీక్షిత్ తెలిపారు."మా మొదటి డిమాండ్‌ను కలకత్తా హైకోర్టు పరిష్కరించింది. కేసును సీబీఐకి బదిలీ చేసింది. హత్యాచార ఘటనను సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని సమగ్రంగా విచారణ జరిపింది. జరుపుతోంది కూడా. అందుకే ఏఐఐఎంఎస్ జనరల్ బాడీ సమ్మె విరమించాలని నిర్ణయించింది. కానీ న్యాయం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటోంది. మా వైద్యులందరూ గురువారం సాయంత్రమే తిరిగి విధుల్లో చేరుతారు" అని రఘునందన్ దీక్షిత్ తెలిపారు.

అంతకుముందు హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు గురువారం ఉదయం విచారణ చేపట్టింది. వైద్యులు పనిచేయకపోతే ప్రజారోగ్య వ్యవస్థ ఎలా పనిచేస్తుందని ప్రశ్నించింది. వైద్యులు విధులు నిర్వర్తించకపోతే రోగులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని కోర్టు వ్యాఖ్యానించింది. వైద్యుల ఆందోళనతో పేదలు నష్టపోకూడదని పేర్కొంది.

మిగితా 2వ పేజీలో

## గ్రూప్-2 షెడ్యూల్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షల షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఉదయం, మధ్యాహ్నం 2 సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి షెడ్యూల్ ప్రకారమైతే.. ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే.. డీఎస్సీ, గ్రూప్ -2 పరీక్షల మధ్య వారం రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో వాయిదా పడ్డాయి. దీంతో గ్రూప్-2 పరీక్షల కొత్త షెడ్యూల్‌ను తాజాగా ప్రకటించారు. రాష్ట్రంలో గ్రూప్ -2 ఉద్యోగాలకు 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

# అదానీ, మోడీ,అమీత్ షాల
## చేతిలో దేశ సంపద



- హిండెన్‌బర్గ్ సంస్థ చెప్పిన నిజాలపై చర్యలు ఎక్కడ
- జెపిసి వేయాల్సిందే
- సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ ఈడీ ఆఫీసు ముందు ధర్నా

బలగం టీవీ, హైదరాబాద్

దేశాన్ని మోడీ, అమిత్‌షా, అదానీ, అంబానీ చెరబట్టారనిటీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిమండి పడ్డారు. దేశ సంపద అంతా వారి గుప్పిట్లో చిక్కుకుపోయిందంటూ ఆరోపించారు. ఏ ప్రధని చేయనన్ని అప్పులు చేసి దేశాన్ని దివాళ తీయించిన మోడీ గొప్పలు చెప్పుకుంటున్నారని మండి పడ్డారు. మోడీ ప్రధాని అయ్యే నాటికి దేశం అప్పు రూ.55 లక్షల కోట్లని.. నేడు అదే అప్పును రూ.1.55 లక్షల కోట్లకు చేర్చి దేశాన్ని అప్పులపాలు చేశారని ధ్వజమెత్తారు. కేంద్ర దర్యాప్తు సంస్థల్ని తమ గుప్పిట్లో పెట్టుకుని కొందరికే లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తున్నారని ప్రధాని మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా విధానాలకు నిరసనగా దేశంలోని అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ పార్టీ గురువారం ఆందోళనలు నిర్వహించింది. దీనిలో భాగంగా హైదరాబాద్ లోని ఈడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో రేవంత్ పాల్గొన్నారు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సంపదను కార్పొరేట్లు ఎలా దోచుకుంటున్నారో హిండెన్‌బర్గ్ సంస్థ సహసోపేతంగా బయట పెట్టిందని

మిగితా 2వ పేజీలో



## పార్టీ జెండా ఆవిష్కరించిన తమిళ హీరో విజయ్

బలగం టీవీ, హైదరాబాద్

సినీ నటుడు విజయ్ చెన్నైలో 'తమిళగ వెట్రి కళగం' పార్టీ జండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు, పార్టీ మద్దతుదారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఏడాది ప్రారంభంలో పార్టీని ప్రకటించిన విజయ్, తాజాగా చెన్నైలో పార్టీ జెండా, గుర్తు ఆవిష్కరించారు. ఎరుపు, పసుపు రంగుల్లో ఉన్న ఈ జెండాపై రెండు ఏనుగులు అటూ, ఇటూ ఉన్నాయి. జెండాలో పైనా, కింద ఎరుపు రంగు, మధ్యలో పసుపు రంగు ఉంది. జెండా మధ్యలో "వాగై" పువ్వు ఉంది. ఇరువైపులా యుద్ధానికి సిద్ధం అన్నట్లుగా రెండు ఏనుగులు ఉన్నాయి. వాగై పువ్వుల దండను సంగం రాజుల కాలంలో విజయానికి గుర్తుగా ధరించేవారు. పార్టీ జెండాతో పాటు టీవీకే గీతాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తల్లిదండ్రులతో పాటు మద్దతుదారులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి విజయ్ ప్రతిజ్ఞ చేశారు. "మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన యోధులను, తమిళ నేల నుంచి వెళ్లి మన హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన అసంఖ్యాక సైనికులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. కులం, మతం, లింగం, ప్రాంతం పేరుతో జరుగుతున్న వివక్షను మేం తొలగిస్తాం. ప్రజలకు అవగాహన కల్పించి అందరికీ సమానహక్కులు, అవకాశాల కోసం కృషి చేస్తాం. సమానత్వం అనే సూత్రాన్ని బలంగా సమర్థిస్తాం" అని విజయ్ ప్రతినబూనారు. వచ్చే ఏడాది తమిళనాడు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో విజయ్ పార్టీ పెట్టడం కీలకంగా మారింది.

## రేవంత్ రెడ్డిని క్షమించమని యాదగిరీశుడిని వేడుకున్నా



- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవీ, హైదరాబాద్

పాలకుడు పాపం చేస్తే ప్రజలకు అరిష్టం అని బ్రాహ్మణ ఉత్తములు చెప్పారని ప్రజలకు అరిష్టం కలగకుండా పాపం చేసిన సీఎంను క్షమించాలని, ప్రజలను రక్షించాలని యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని వేడుకున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. రైతులందరికీ రుణమాఫీ, పంటల బోనస్ ఇచ్చేంత వరుకు పోరాడే శక్తిని ఇవ్వాలని వేడుకున్నాని అన్నారు. రుణమాఫీ పూర్తైందని సీఎం చెబుతున్నారని మంత్రులు మాత్రం ఇంకా చేయాల్సింది ఉందని చెబుతున్నారని ప్రజలు ఎవరి మాటలను నమ్మాలని ప్రశ్నించారు.

గురువారం యాదాద్రి లక్ష్మి నరసింహస్వామిని హరీశ్‌రావు దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ఆగస్టు 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తానని యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి మీద ఒట్టు పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం స్వామి వారి దర్శనం కోసం యాదాద్రికి వచ్చానని తెలిపారు. రేవంత్ రెడ్డి ఏ దేవుళ్లపై ఒట్లు పెట్టారో ఆయా ఆలయాలకు వెళ్లి పాప ప్రాయశ్చిత్తం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ విషయంలో దేవుళ్లను కూడా సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. ఏ దేవుళ్లపై ఒట్లు పెట్టారో ఆయా ఆలయాలకు వెళ్లి పాప ప్రాయశ్చిత్తం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ, పంటల బోనస్ ఇచ్చేంత వరుకు పోరాడే శక్తిని ఇవ్వాలని వేడుకున్నాని అన్నారు. రుణమాఫీ పూర్తైందని సీఎం చెబుతున్నారని మంత్రులు మాత్రం ఇంకా చేయాల్సింది ఉందని చెబుతున్నారని ప్రజలు ఎవరి మాటలను నమ్మాలని ప్రశ్నించారు.

మంత్రులు చెప్పే లెక్క ప్రకారం రాజీనామా ఎవరు చేయాలో చెప్పాలని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి నీతి, నిజాయతీ ఉంటే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ దేవుళ్లపై ఒట్లు పెట్టారో ఆ దేవుళ్ల వద్దకు వెళ్లి రేవంత్‌రెడ్డి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించారు. రూ.4 వేల రూపాయల పింఛన్ కోసం వృద్ధులు, వితంతువులు ఎదురు చూస్తున్నారని వాటిని అమలు చేయాలని తెలిపారు. మహిళలకు రూ.2500 ఇస్తానని హామీ ఇచ్చారని వారు అడుగుతున్నారని వారికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## గద్దర్ అవార్డుల కోసం ప్రత్యేక కమిటీ

- చైర్మెన్‌గా బి.నర్సింగరావు, వైస్ చైర్మన్‌గా దిల్‌రాజు

బలగం టీవీ, హైదరాబాద్

చిత్ర పరిశ్రమను ప్రోత్సహించేందుకు తెలంగాణ సర్కార్ వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో గద్దర్ అవార్డుల కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావు, వైస్ ఛైర్మన్‌గా నిర్మాత దిల్‌రాజులను

మిగితా 2వ పేజీలో

# వచ్చే ఏడాది నుంచి సన్న బియ్యం



బలగం టీవీ, హైదరాబాద్

తెల్లరేషన్ కార్డు దారులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కొత్త ఏడాదిలో చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీతో పేదల కడుపునింపేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదేసమయంలో పి.డి.యస్ బియ్యం దారి తప్పితే కఠిన చర్యలు తీసుకోవాలని, ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ పట్టుబడితే డీలర్ షిప్ రద్దు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే జనవరి నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చౌక ధరల దుకణాలన్నింటిలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించ నున్నట్లు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ప్రకటించారు. గురువారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విజిలెన్స్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పి.డి.యస్ బియ్యం దారి తప్పితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పి.డి.యస్ బియ్యం పట్టుబడితే తక్షణమే డీలర్ షిప్ రద్దు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న1629 చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీకి వెంటనే ఉపక్రమించాలన్నారు.ప్రభుత్వ వసతి గృహాలతో పాటు అంగన్ వాడి, మధ్యాహ్న భోజనాలలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. తరచు తనిఖీలు నిర్వహిస్తుంటే మార్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.మహాలక్ష్మి పథకంలో బాగంగా లబ్ధిదారులకు వంటగ్యాస్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యే విషయాన్ని వారికి ప్రస్ఫుటంగా చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర రెవిన్యూ, సమాచార శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పౌరసర ఫరాల శాఖా కార్యదర్శి డి.యస్.చౌహాన్‌లతో పాటు వైద్య ఆరోగ్య, ఉన్నత విద్య, బి.సి సంక్షేమ, యస్.సి సంక్షేమ, గిరిజన సంక్షేమ, విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ తదితర మొత్తం ఎనిమిది శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సంతకం పెట్టాలని నాపై ఒత్తిడి చేశారు

- **రాష్ట్ర సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరేందర్‌రెడ్డి**

బలగం టీవి, హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల వ్యవహారంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఇరిగేషన్ మంత్రిగా హరీశ్‌రావు తనపైన ఒత్తిడి తీసుకొచ్చారని రాష్ట్ర సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరేందర్‌రెడ్డి ఆరోపించారు. తొందరగా అప్రూవల్ కావాలన్న షరతుతో తగినంత సమయం ఇవ్వకుండా హడావిడిగా సంతకాలు చేయించుకున్నారని అన్నారు. డిజైన్లలో హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించిన అంశాలతో తనకు సంబంధం లేదని చెప్పినా ఉన్నతస్థాయిలో తాము ఆథెంటికేట్ చేస్తున్నాం గదా... అని నొక్కిచెప్పి బలవంతంగా సంతకాలు తీసుకున్నారని అన్నారు. ఒక దశలో సంతకం ఎందుకు చేయడం లేదు... ఏం ఇబ్బంది ఉన్నది... అంటూ ప్రశ్నించారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ నిర్వహిస్తున్న బహిరంగ విచారణకు గురువారం హాజరైన ఆయన జస్టిస్ పీసీ ఘోష్ ముందు స్టేట్‌మెంట్ నమోదు చేశారు. కేంద్ర జల సంఘం ఆమోదం తర్వాత కూడా డిజైన్లలో మార్పులు జరిగాయన్నారు.

డిజైన్‌కు సంబంధించిన వ్యవహారాలకు మాత్రమే తాను జవాబుదారీ అని, కానీ హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించిన అంశాలపై కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ దగ్గర సైతం ఈ అంశాన్ని ప్రస్తావించానని నరేందర్‌రెడ్డి గుర్తుచేశారు. చెక్‌లిస్టుకు సంబంధించిన అంశాల్లోనూ ఇదే ఇబ్బంది ఎదురైందన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ లేవనెత్తిన ప్రశ్నకు నరేందర్‌రెడ్డి బదులిస్తూ... దీని డిజైన్లను 2017 మార్చి 29న రిలీజ్ చేశామన్నారు. ఈ బ్యారేజీకి సంబంధించిన ప్రతీ కాంపొనెంట్ డిజైన్‌లో ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. సీడీఓ సీఈ (అప్పట్లో చీఫ్ ఇంజినీర్)గా తాను రూపొందించిన ప్రతీ డిజైన్‌లో ఎల్ అండ్ టీ సంస్థ ఇన్వాల్వ్ అయిందని సమాంతర డిజైన్లను ఇచ్చిందన్నారు. కానీ ఆ తర్వాత మాత్రం తనకు ఏం సంబంధం లేదంటూ తప్పుకున్నదని, పూర్తి బాధ్యత సీడీఓదే అంటూ మాట మార్చిందన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ ఖరారు కావడానికి ముందు వివిధ అంశాలపై రూపొందించిన చెక్ లిస్టు విషయంలోనూ 2017 ఫిబ్రవరి 21న తయారుచేసిన లెటర్‌లో తిరకాసు ఉన్నదన్నారు. చివరకు సీడీఓ పేరుతో డిజైన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి వచ్చిందని, కానీ ఆ తర్వాత ఆ లెటర్‌లో కొన్ని పదాలను తొలగించినట్లు గుర్తించానని, సమాచార హక్కు చట్టం ద్వారా ఒరిజినల్ లెటర్‌ను తెప్పించుకోవాల్సి వచ్చిందని నరేందర్‌రెడ్డి కమిషన్‌కు వివరించి ఆ ఆర్టీఐ రిప్లై కాపీని అందజేశారు. ఉద్దేశపూర్వకంగా పై స్థాయిలో ఉన్న పెద్దలు (అప్పటి సీఎం, ఇరిగేషన్ మంత్రి) సేఫ్ జోన్‌లోకి వెళ్ళేలా ఈ పదాలను డిలీట్ చేశారని కమిషన్‌కు స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి అప్పటి సీఎం, ఇరిగేషన్ మంత్రులు, ఉన్నతాధికారులు సమావేశాలు పెట్టుకున్నా ఎన్నడూ తనను ఆహ్వానించలేదని, ఆ మీటింగులకు తాను హాజరుకాలేదన్నారు. కేవలం బ్యారేజీలు కట్టే లొకేషన్లను మాత్రమే తనకు పంపి డిజైన్లు రూపొందించాల్సిందిగా ఆదేశించారన్నారు.

ఎవరి నిర్ణయం మేరకు మేడిగడ్డ లొకేషన్ ఖరారైందో తనకు తెలియదని, కాంట్రాక్టు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం (అగ్రిమెంట్) కాపీ కూడా తాను రిటైర్ అయ్యే సమయం వరకూ ఇవ్వలేదన్నారు. బ్యారేజీల నిర్మాణం సమయంలోనే లోపాలు, తప్పిదాలు జరిగాయని, కేంద్ర జల సంఘానికి అప్రూవల్ కోసం డీపీఆర్ పంపి ఆమోదంతో తిరిగొచ్చిన తర్వాత కూడా కొన్ని మార్పులు జరిగాయన్నారు. డిజైన్‌కు తగినట్లుగా నిర్మాణం జరుగుతున్నదో లేదో తనిఖీ చేసే సంప్రదాయం గత ప్రభుత్వంలో కొరవడిందని, అందువల్లనే తాను వెళ్ళలేదన్నారు. నిర్మాణం ప్రారంభం కావడానికి ముందే మేడిగడ్డ సైట్‌ను చూశాను తప్ప ఆ తర్వాత విజిట్ చేయలేదన్నారు. నిర్మాణం తర్వాత బ్యారేజీ నిర్వహణలోనూ నిర్లక్ష్యం చోటుచేసుకున్నదని, కనీస స్థాయిలో జరగాల్సిన మెయింటెనెన్స్ కూడా లేదన్నారు.

నిజానికి బ్యారేజీలకు డిజైన్, డ్రాయింగ్ రూపొందించిన తర్వాత వాటికి తగినట్లుగానే నిర్మాణం జరుగుతున్నదో లేదో చూడాల్సిన బాధ్యత సీడీఓ చీఫ్ ఇంజినీర్ బాధ్యత అయినా తనకు ఎలాంటి రోల్ లేకుండా పోయిందని, తనిఖీలు చేసే అవకాశం గత ప్రభుత్వంలో లేకుండా పోయిందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదనలు, కాన్సెప్ట్ బాధ్యులెవరో తనకు తెలియదన్నారు. ఏనాడూ ఆ చర్చల్లో, సమావేశాల్లో తాను హాజరు కాకపోవడంతో తనకు స్పష్టత లేదన్నారు. డిజైన్, డ్రాయింగ్‌లలో భాగంగా 2-డి డిజైన్లను రూపొందించామన్నారు. 3-డీ మోడల్ స్టడీస్ పూర్తయిన తర్వాత డిజైన్లు రూపొందించాల్సి ఉన్నా అప్పటి సీఎం, మంత్రి ఒత్తిడి కారణంగా కాలేదన్నారు.

### గంజి వాగుపై
# బ్రిడ్జి నిర్మాణ పనులు ఎక్కడి దాకా పూర్తయ్యాయి...



- **బోయినపల్లి జడ్పీ స్కూల్ భవనం, పీహెచ్ సీ తనిఖీ..**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల :**

బోయినపల్లి నుంచి వేములవాడ రోడ్డులో గంజి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు ఎక్కడి దాకా పూర్తి అయ్యాయి, బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం గంజి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు ఎక్కడి దాకా పూర్తి అయ్యాయో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. బోయినపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాల భవనంలో తరగతి గదులు, టాయిలెట్స్ తదితర పనులు పరిశీలించి, కావాల్సిన మరమ్మత్తులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని డీఈఓ రమేష్ కుమార్ ను ఆదేశించారు. నూతన విద్యాలయాన్ని అక్కడికి తరలించి, అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.అనంతరం బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రక్త పరీక్షల గది, ఫార్మసీ గది, లేబర్ రూం పరిశీలించారు. అనంతరం ఓపీ రిజిస్టర్ తనిఖీ చేసి, ఎంత మంది రోగులు వచ్చారు,ఎందరికి రక్త పరీక్షలు చేశారని డాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటల వరకు 11 మంది రాగా, ఒకరికి రక్త పరీక్ష చేసినట్లు కలెక్టర్ దృష్టికి డాక్టర్ తీసుకెళ్లారు. మందులు, టెస్ట్ కిట్లు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈఓ వినోద్, ఎంపీడీఓ జయశీల, వైద్యాధికారి రేణుక తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వెంకట రామారెడ్డి జయంతి వేడుకలు..

బలగం టీవీ , సిరిసిల్ల

రాజా బహుదూర్ వెంకట రామారెడ్డి జయంతి వేడుకలను సిరిసిల్లలో జిల్లా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా రెడ్డి సంఘము జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి మాట్లాడుతూ రాజ బహుదూర్ వెంకటరామ రెడ్డి నిరుపేద రెడ్డిలకు ముఖ్యంగా, అన్ని వర్గాల వారికి సేవ చేశారని అన్నారు.విద్యాసంస్థలను నెలకొల్పులతో పాటు వసతి గృహాలను సైతం ఏర్పాటుచేసి తన ఆస్తులను కూడా త్యాగం చేసిన మహానుభావుడన్నారు.నిజాం కాలంలో కోత్వాల్ (పోలీస్ కమిషనర్)గా ఎనలేని సేవ చేశారు అని అన్నారు. ప్రతి ఒక్కరూ వెంకటరామ రెడ్డి ఆశయాల కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం గత వార్షిక పరీక్షలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు కు నగదు పారితోషకాలు అందిస్తూ తల్లిదండ్రులను సత్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దూరు రాంరెడ్డి, మాజీ అధ్యక్షులు కోర్ కమిటీ సభ్యులు పూర్మాణి రామలింగారెడ్డి, పాతూరి మహేందర్ రెడ్డి, బాణాపురం రంగారెడ్డి, పొన్నాల బాల్ రెడ్డి, జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు వివిధ మండలాల అధ్యక్షులు, గ్రామాల అధ్యక్షులు, కుల బంధవులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లీడర్ల స్ప్లిట్ పర్సనాలిటీ

బలగం టీవీ , హైదరాబాద్



అదానీ వ్యవహారంలో కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే ద్వంద్వ నీతి కూడా ఆత్మహత్య చేసుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓ వైపు ఢిల్లీ కాంగ్రెస్ ఏమో అదానీ సంస్థలు మోడీ జేబు సంస్థలంటూ ఆరోపణలు చేస్తుంటే.. మరోవైపు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి మాత్రం అదానీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఇవ్వాళ అదే రేవంత్ రెడ్డి సహా మంత్రులు అదానీ సంస్థకు వ్యతిరేకంగా ఆందోళన చేయనున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు ఏమైనా స్ప్లిట్ పర్సనాలిటీ వ్యాధితో బాధపడుతున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రెడ్ కార్పెట్ వేసి మరీ అదానీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. నేడు నిరసన తెలపనుండటం ఈ ఏడాదిలోనే అతి పెద్ద జోక్ అని కేటీఆర్ అన్నారు. అదానీ సంస్థలకు ప్రోత్సహకాలు ఇచ్చి ఇప్పుడు అదే అదానీ మోసగాడని ఆరోపిస్తున్నారంటే కాంగ్రెస్‌ను ఏమనాలని ప్రశ్నించారు. ఇలాంటి డ్రామాలతో దేశాన్ని మోసం చేకాంగ్రెస్ లీడర్ల స్ప్లిట్ పర్సనాలిటీ %%. ఆ వ్యాధిగాని సోకిందా?గల్లీలో దోస్తీ.. ఢిల్లీలో కుస్తీ. ఇదీ కాంగ్రెస్ నీతి. దీనిపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పగలరా అంటూ నిలదీశారు.

సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్-అదానీ సంస్థలు కుమ్మక్కైనట్లు హిండెన్ బర్గ్ అనే అమెరికా సంస్థ ఆరోపణలు చేసింది. దీని ఆధారంగా ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో విచారణ చేయాలని కాంగ్రెస్ గురువారం దేశ వ్యాప్తంగా ఆందోళనక పిలుపునిచ్చింది.

# తెలంగాణ స్పోర్ట్స్ కొత్త లోగో ఆవిష్కరణ..




బలగం టీవి, హైదరాబాద్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) కొత్త లోగోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. 'స్పోర్ట్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో రూపుదిద్దుకున్న శాట్ కొత్త లోగో, డిజైన్ స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని సీఎం అభినందించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ లోగో ఆవిష్కరణలో ముఖ్యమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి, శాట్ ఎండీ సోనిబాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి



- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన మంద కృష్ణ మాదిగ**

బలగం టీవి, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గారు కలుసుకున్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ గారితో పాటు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ గారు, ఎమ్మెల్యేలు వేముల వీరేశం గారు, కవ్వంపల్లి సత్యనారాయణ గారు, కాలె యాదయ్య గారు, లక్ష్మీకాంతారావు గారు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు గారు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ గారు తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జన్మదిన వేడుకలు

- **10/10 జీపీఎస్ సాధించిన విద్యార్థులకు సన్మానం**



**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ఆర్ ఇ పి ఏ రెడ్డీస్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజా బహదూర్ కోత్వాల్ వెంకట రామారెడ్డి 155 జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.రానున్న రోజుల్లో రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహాన్ని ఎల్లారెడ్డిపేట బస్టాండ్ ప్రాంతంలో పెట్టడానికి గత పాలకవర్గం తీర్మానం చేసి కాపీని కూడా అందజేశారు త్వరలో ఎల్లారెడ్డిపేట రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో విగ్రహాన్ని నిర్మాణం పూర్తి చేస్తామని తెలియజేశారు.

రాజా బహదూర్ వెంకట్రామా రెడ్డి గొప్ప సంఘ సేవకులు విద్యా దాతలు.మనిషికి చదువు అవసరం అని నమ్మినవారు అందుకె ఎన్నో బడులకు, కళాశాలలకు మరియు వసతి గ్రుహాలకు డబ్బును దానం చేసినారు. పల్లెటూర్ల నుండి హైదరాబాద్ రావడమే కష్టమైనటువంటి రోజుల్లో ఆబిడ్స్ మరియు నారాయణగూడ లాంటి ప్రధానమైన ప్రాంతాల్లో విద్యా సంస్థలను, వసతి గ్రుహాలను నిర్మించారు.కుల మతాలకు అతీతంగా విద్యార్థులకు రెడ్డి హాస్టళ్ళలో ఆశ్రయం కల్గించిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు.

అనంతరం ఎల్లారెడ్డిపేట మండలంలోని రెడ్డి విద్యార్థిని విద్యార్థులకు పదవ తరగతిలో 10/10 జిపిఏ ఇంటర్మీడియట్ విద్యార్థులకు అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు, వ్యవసాయ రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి సన్మాన కార్యక్రమం లో భాగంగా మేమంతో నగదు రూపేనా ఆత్మీయ సన్మానం చేశారు. మండలానికి చెందిన నాయిని విశ్వక్ రెడ్డి, గన్న సాత్విక రెడ్డి,రేష్మితా రెడ్డి, ఇల్లందుల రిషిక, కొండే సురేందర్ రెడ్డి,వంగ నరసింహారెడ్డి, శివారెడ్డి,

ఎర్ర భాస్కర్ రెడ్డి,అక్క పెళ్లి చెందిన కీర్తన కు 500 రూపాయల పారితోషికం తోపాటు సన్మానం చేశారు.రేపా కన్వీనర్ మోతే దేవా రెడ్డి,కో కన్వీనర్ ముత్యాల వెంకటరెడ్డి, ముత్యాల శ్రీనివాస్ రెడ్డి,యమగోండ బాల్ రెడ్డి,ముత్యాల ప్రభాకర్ రెడ్డి,కోల బాపురెడ్డి, నాయిని భాస్కర్ రెడ్డి,తాడ ప్రభాకర్ రెడ్డి,అమరేందర్ రెడ్డి,గుండాడి వెంకటరెడ్డి, పారిపెల్లి రామిరెడ్డి, వంగ గిరిధర్ రెడ్డి,ముత్యాల శేఖర్ రెడ్డి,ఎమకొండ కిష్టారెడ్డి, మల్లారపు అమరేందర్ రెడ్డి, కొండే రాంరెడ్డి లు పాల్గొన్నారు.



# రెండు దశాబ్దాలుగా అంకిత భావంతో పనిచేస్తున్నా..

**-ఏఎంసీ చైర్మన్ గా అవకాశం కల్పించండి : సీనియర్ నాయకుడు లింగం**


బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట

గత రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ కోసం అంకితభావంతో కష్టపడి పనిచేస్తున్న తనకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి లను పందిర్ల లింగం గౌడ్ వ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ రిజర్వేషన్ కేటాయించడంతో చైర్మన్ గా తను అన్ని విధాల అర్హుడునని గుర్తు చేశారు.ఏఎంసీ చైర్మన్ గా తనకు అవకాశం కల్పించాలని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ లను కోరారు.ఈ పదవి తనకు కేటాయిస్తే పార్టీని మరింత బలోపేతం చేసి రైతులందరికీ తనవంతు శాయశక్తుల కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పందిర్ల లింగం గౌడ్ స్పష్టం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు బుచ్చిలింగం సంతోష్ గౌడ్, పుల్లయ్య గారి తిరుపతి గౌడ్, బి పేట రాజ్ కుమార్, గుండాడి శ్రీనివాస్ రెడ్డి, గోలిపెల్లి ప్రతాపరెడ్డి, గంట స్వామి గౌడ్, గంట రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బీటెక్ స్టూడెంట్ దారుణ హత్య

బలగం టీవీ , హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా రాచకొండ కమీషనరేట్ బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంజినీరింగ్ విద్యార్థి దారుణహత్యకు గురైన ఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండి 37 హొటల్‌కు సమీపాన ఉన్న ఓ పాన్ షాపు దగ్గర విద్యార్థి మోండ్రు ప్రశాంత్ (21) పై ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు తీవ్ర గాయాలైన ప్రశాంత్‌ను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రశాంత్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నట్టు పోలీసులు తెలిపారు. ఆ దాడి ఘటనలో ముగ్గురు దుండగులు ఉన్నట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వివరించారు. ఘటనపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా ఇంజనీరింగ్ విద్యార్థి హత్యకు ప్రేమ వ్యవహారం లేక ఆర్థిక వివాదాల పాత కక్షలే కారణమా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.




# అదానీ, మోడీ,అమీత్ షాల చేతిలో దేశ సంపద

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. అదే అంశంపై ఇప్పటికే పార్లమెంట్‌లో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిందని గుర్తు చేశారు. అదానీ, అంబానీతో సహా మోడీ తన పరివారాన్ని కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా జేపీసీ వేయాలంటూ పార్లమెంట్‌లో డిమాండ్ చేస్తే మోడీ తప్పించుకు తిరిగారని.. ప్లాన్ ప్రకారం నాలుగు రోజులు ముందు గానే పార్లమెంట్‌ను వాయిదా వేశారని మండిపడ్డారు. దేశ సంపదను అప్పనంగా దోచుకున్న వారిని పక్కాగా జైలుకు పంపే వరకు పోరాడతమని అన్నారు.ఆనాడు మహా నాయకురాలు ఇందిరా గాంధీ బ్యాంకులను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. నిరుపేదలకు భూములను పంచిన ఘటన కేవలం ఇందిరకే దక్కిందని అన్నారు. దేశంలో ఐటీ రంగానికి పునాది వేసిందే రాజీవ్ గాంధీయేనని గుర్తు చేశారు. పీవీ నరసింహా రావు లాంటి మహా నాయకులు అత్యుత్తమ సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. దేశానికి బీజేపీ ముప్పుగా పరిణమించిందని, ప్రజల సంపద ఎలా దోపిడీకి గురైందో అందరికీ తెలియాలని అన్నారు.

ప్రధాని మోడీపై కొట్లాడతామన్న సన్నాసులు ఏమయ్యారని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి ఆయన ఫైర్ అయ్యారు. హిండెన్‌బర్గ్ అంశంలో బీఆర్ఎస్ విధానం ఏంటో చెప్పాలన్నారు. బీజేపీని సంతోష పెట్టేందుకే శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు రాజీవ్ పేరు తొలగిస్తామంటున్నారని ధ్వజమెత్తారు. ఒకవేళ రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముట్టకుంటే వీపు చింతపండు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఉద్యోగం ఊడిన తరువాత వీళ్లకు తెలంగాణ తల్లిపై ప్రేమ పుట్టుకొచ్చిందని కామెంట్ చేశారు. ఇక హిండెన్‌డబర్గ్ అంశంపై పార్లమెంట్‌లో జేపీసీ వేయాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వివేక్ వెంకట స్వామి, జయవీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

నర్సోడా గ్రామానికి వెళ్లానని.. గ్రామాల్లో ఇప్పుడు కళ తప్పిందని అక్కడి ప్రజలు అన్నారని చెప్పుకొచ్చారు.డిసెంబర్ 9 నాడు అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేస్తానని సోనియా గాంధీ మీదా ఒట్టు వేసి చెప్పారని , రైతుల రుణమాఫీ కావాలంటే రూ. 49 వేల కోట్లు ఖర్చు అవుతుందని బ్యాంకు అధికారులు చెప్పారని రేవంత్ కు కెటిఆర్ గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో దేవుళ్ల మీద ఒట్టు పెట్టారని..చివరకు రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు.

'దేవుళ్ళు కూడా అడుగుతున్నారు.. రేవంత్ రెడ్డి ఎక్కడకి పోయాడని.. మమ్మల్ని మోసం చేశాడని.' అని సీఎంపై విరుచుకుపడ్డారు కేటీఆర్. డబ్బులు లేక రైతు రుణమాఫీ విషయంలో కొర్రీలు పెట్టారని దుయ్యబట్టారు. రూ. 31 వేల కోట్లు అవసరమని కేబినెట్‌లో పెట్టారని.. బడ్జెట్‌లో చూస్తే రూ. 26 వేల కోట్లే పెట్టారని విమర్శించారు. ఇదే అంశంపై అసెంబ్లీలో తాము ప్రశ్నిస్తే తమ మైక్‌లు కట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు.

రైతు రుణమాఫీ కాలేదని రైతులందరూ ఇవాళ రేవంత్ రెడ్డి చావు డబ్బు కొడుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో రైతు రుణమాఫీ పూర్తిగా కాలేదన్నారు. కొండారెడ్డిపల్లి రైతుల దగ్గరకు పోదామని తాను సవాల్ చేస్తే.. తన సవాల్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వీకరించలేదు ఎద్దేవా చేశారు. కొండారెడ్డిపల్లిలో రైతు రుణమాఫీ జరిగిందని రైతులు చెబితే తాను వెంటనే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. రూ. 7,500 కోట్లు మాత్రమే రైతు రుణమాఫీ జరిగిందని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క బ్యాంకర్లతో అంటున్నారని.. ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేయాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు. రుణమాఫీ పూర్తిగా చేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రైతుబంధు కోత పెట్టేందుకు కూడా రేవంత్ సర్కార్ సిద్ధంగా ఉందన్నారు

# గద్దర్ అవార్డుల కోసం ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

నియమించింది.అలాగే కమిటీ సలహాదారులుగా దర్శకేంద్రుడు రాఘవేందర్ రావు, అందెశ్రీ, తమ్మారెడ్డి భరద్వాజ, దగ్గుబాటి సురేశ్ బాబు, చంద్రబోస్, ఆర్.నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సానా యాదిరెడ్డి, హరీశ్ శంకర్, బలగం వేణులతోపాటు ఎఫ్‌డీసీ ఎండీ మెంబర్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్?డీసీ ఈ కమిటీతో చర్చించి తదుపరి కార్యాచరణ మొదలుపెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఫిబ్రవరిలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన గద్దర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్, నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది నుంచి గద్దర్ జయంతి రోజున ఆ పురస్కారాలు ఇస్తామని తెలిపారు. వారి సేవలను స్మరించుకునేందుకే ఈ నిర్ణయాన్ని ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం గద్దర్ అవార్డుల కోసం కమిటీని నియమించింది.

# సుప్రీం కోర్టు హామీతో సమ్మె విరమించిన వైద్యులు

(మొదటి పేజీ తరువాయి)


మొదట ఆందోళన చేస్తున్న డాక్టర్లను విధుల్లో చేరమని సూచించింది. ఆ తర్వాత వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూస్తామని స్పష్టం చేసిం ది. సమ్మె వల్ల రోగులు పడే ఇబ్బందులు గురించి ఆలోచిం చాలని సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది.

డాక్టర్లపై ఎఫ్ఐఆర్‌లు రద్దు చేయాలంటే ముందు విధుల్లో చేరాలని సూచించింది. వైద్యులు విధుల్లో చేరాకే అన్ని విషయాలను పరిశీలిస్తామని తెలిపింది. వైద్యులకు భద్రతపై రాష్ట్రాలు రెండు వారాల్లో చర్యలు చేపట్టాలని ఆదేశించింది. హత్యాచార ఘటనను రాజకీయం చేయొ ద్దని, చట్టం తన పని చేసుకుపోతుందని తెలిపింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ 5కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో వైద్యులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు.

మరోవైపు, హత్యాచారం జరిగిన కేసు తమ చేతికి వచ్చేసరికి క్రైమ్ సీన్ మొత్తాన్ని మార్చేశారని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఫలితంగా దర్యాప్తు సవాల్‌గా మారిందని సుప్రీంకోర్టుకు సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా కోల్‌కతా పోలీసుల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కేసు నమోదులో లోపాలపై ప్రశ్నల వర్షం కురిపించింది. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు 14 గంటల ఆలస్యం ఎందుక య్యిందని బెంగాల్ సర్కారును సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

# అమెరికాలో 90 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహం

బలగం టీవీ , హైదరాబాద్



అమెరికాలోని టెక్సాస్‌లో భారీ హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. హూస్టన్ సమీపంలో ఆ మహావిగ్రహాన్ని ఆవిష్కరించారు. 90 ఫీట్ల ఎత్తైన ఆ విగ్రహం.. అమెరికా ఆధ్యాత్మిక, సాంస్కృతిక విపణిలో కొత్త మైలురాయి అవుతుందని పేర్కొన్నారు. హూస్టన్‌లో ఉన్న ఈ విగ్రహం.. ఎన్నో మైళ్ల దూరం నుంచి కనిపిస్తున్నది. అమెరికాలో ఉన్న మూడవ అతిపెద్ద విగ్రహంగా రికార్డు క్రియేట్ చేసింది. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ(151 ఫీట్లు), ఫ్లోరిడాలోని హల్లండేలా బీచ్‌లో పెగాసస్-డ్రాగన్(110 ఫీట్లు) విగ్రహం తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

సుగర్ ల్యాండ్‌లో ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో హనుమాన్ మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆగస్టు 15 నుంచి 18 వరకు జరిగిన ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో దీన్ని ఓపెన్ చేశారు.శ్రీ చిన్న జీయర్ స్వామిజీ చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. హనుమంతుడి మెడలో 72 ఫీట్ల పూలమాలను వేశారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలి..




- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**
ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, వాటిని ఏ విధానంలో పూర్తి చేయడం, యాప్ లో వివరాల నమోదు పై గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా సందీప్ కుమార్ ఝా హాజరై, మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి మొత్తం కలిపి 42,941 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.దరఖాస్తులలో అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సేకరించాలని, జిల్లాలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వారు వివరాలు సేకరించి, యాప్ లో నమోదు చేయాలని అన్నారు.

సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/ మున్సిపాలిటీలలో బృందాలు పరిశీలన చేసి జిపిఎస్ ద్వారా సదరు భూమి కో ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేయాలని అన్నారు.రెగ్యులర్ చేసే భూములు నీటి వనరుల బఫర్ జోన్ , నాలా, చెరువులు , హెరిటేజ్ బిల్డింగ్ పరిధిలోని కావని ధ్రువీకరించాలని,అన్ని ప్రభుత్వ శాఖల భూముల వివరాలు అందరి వద్ద సమాచారం ఉండాలని అన్నారు . నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణ లకు గురి కాకుండా చూసుకోవాలని, కలెక్టరేట్, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డీటీసీపీఓ అన్సారీ, రూరల్ నోడల్ ఆఫీసర్, వీటీడీఏ సీపీఓ రాజ్ కుమార్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, రెవెన్యూ అధికారులు, ఎంపిడిఓలు, ఇరిగేషన్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలలో
# డీజేలు వినియోగిస్తే సీజ్..



- ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలి:
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో నమోదు అవుతున్నా కేసులలో పోలీసు అధికారులు పకడ్బదీగా పారదర్శకంగా విచారణ చేపట్టి, కోర్టులలో నెరస్తులకు శిక్షలు పడే విధంగా ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలని పోలీస్ అధికారులను ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు.గురువారం సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ అఖిల్ మహాజన్ నేర సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పిర్యాదు స్వీకరణ నుండి కేసు నమోదు చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేసి కోర్టు లలో దోషులకు శిక్షలు పడే విధముగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అన్నారు.ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు.

జిల్లాలో రౌడీ షీటర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినంగా వ్యహరించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఏర్పాటు చేసి,వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలన్నారు.

నేర నియంత్రణలో విలేజ్ పోలీస్ అధికారి కీలక పాత్ర అని, జిల్లాలో గ్రామ స్థాయిలో విలేజ్ పోలీస్ అధికారి వ్యవస్థ బలోపేతం చేసి,గ్రామ స్థాయిలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోలని తద్వారా శాంతి భద్రతల పర్యవేక్షణ సులబతరం అవుతుందన్నారు.నేర పరిశోధనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత ను ప్రజలకు అవగాహన కల్పిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

గ్రామాల్లో, మండల కేంద్రాల్లో,పట్టణ కేంద్రాల్లో ఎలాంటి అనుమతులు లేకుండ ఫ్లెక్సీస్ ఏర్పటు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని,పండగలు,వివిధ జాతర సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ భద్రత చర్యలు తీసుకోవాలన్నారు.

రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా డీజే ల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా డిజే ఉపయోగించినట్లు అయితే కేసులు నమోదు చేసి డిజేల ను సీజ్ చేయాలని ఆదేశించారు.వివిధ కారణాలతో రోడ్ల మీదకు వచ్చి రాస్తా రొక,దర్నా ల పేరుతో ప్రజా రవాణాకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.

జిల్లాలో అక్రమ గంజాయి రవాణా,గుడుంబా,అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ రైస్ లపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో స్పెషల్ డ్రైవ్ లు ఏర్పాటు చేసి మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా,నెంబర్ ప్లేట్ లేకుండా,మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై,డ్రంక్ అండ్ డ్రైవ్,ఓపెన్ డ్రింకింగ్ లపై, నిబంధనలకు విరుద్ధంగా సైరైన్ ఉపయోగించే వాహనాలపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు చంద్రశేఖర్ రెడ్డి, మురళి కృష్ణ ,సి.ఐ లు,ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, ఐటీ కోర్ సిబ్బంది, పాల్గొన్నారు.

## వేములవాడలో 25 న మెగా జాబ్ మేళా...

**బలగం టీవీ , వేములవాడ**
వేములవాడలో ఈ నెల 25 న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించిన పోస్టరును వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్ లో ఈ నె ల 25 న చేపట్టనున్న మెగా జాబ్ మేళా ను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఈ మెగా జాబు మేళలో హైదరాబాద్ నుంచి సుమారు 50కి పైగా కంపెనీలు వస్తున్నాయని, ఎంపికైన అభ్యర్థులకు అదేరోజు నియా మక పత్రాలు అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963357250, 9885346768. నెంబర్లలో సంప్రదించాలని అన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన విద్యార్థి సంఘాలు



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట :**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఎల్లారెడ్డిపేట డిప్యూటీ తహసిల్దార్ తో పాటు బీఆర్ఎస్వి, బిఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు గురు వారం సందర్శిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ లో వసతులు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హాస్టల్లో దోమలు ఎలుకలు పాములతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంగళవారం ఇద్దరు విద్యార్థులకు ఎలుకలు కరవడంతో విషయాన్ని బయటకు వెళ్లకుండా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకున్నారని,హాస్టల్లో చెత్త చెదారం పేరుకుపోవడంతో పాములు కూడా వస్తున్నాయని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.వంట గదిలో కుళ్ళిపోయిన కూరగాయలు దర్శనమిచ్చాయని, విద్యార్థులకు సరియైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం గురుకుల హాస్టల్ లను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థి సంఘాల ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.గురుకుల పాఠశాలలను సందర్శించడం కాదు గురుకుల పాఠశాలలో ఉన్న గడ్డిని విద్యార్థి సంఘాల నాయకులే తీసివేయాలని ఇన్చార్జి ప్రిన్సిపల్ సురేష్ చందర్ అన్నారు.నార్త్ ఇండియాకు చెందిన ఇన్చార్జి ప్రిన్సిపాల్ కు, ఉపాధ్యాయులకు పొంతన లేకుండా పోయిందని వాపోయారు.నార్త్ ఇండియా ఉపాధ్యాయులకు తెలుగు రాకపోవడంతో విద్యార్థులు అందులో పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులు నార్త్ ఇండియా సిబ్బందితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకుల హాస్టల్ లో వసతులు కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులకు డిమాండ్ చేశారు., ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు సింగారం దేవరాజ్, కొర్రి అనిల్, మునిగే ప్రమోద్, సింగారపు మధు ,సిరికొండ నాగరాజ్, తిరుపతి, ఆశీర్వాదం, జుబేర్, బీఎస్ఎఫ్ నాయకులు కరుణాకర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



## కోత్వాల్ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి కి ఘన నివాళి

**బలగం టీవీ , తంగళ్లపల్లి**
తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని గ్రామ రెడ్డి సంఘం భవనంలో కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి 155 వ జయంతి వేడుకలు రెడ్డి సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు ఎడమల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి రెడ్డి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, జిల్లా రెడ్డి సంఘ ప్రచార కార్యదర్శి ఎడమల హనుమంత రెడ్డి , మాజీ సర్పంచ్ ఆసాని సత్యనారాయణ రెడ్డి,ఫ్రెండ్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎడమల శ్రీధర్ రెడ్డి,తంగళ్ళపల్లి గ్రామ రెడ్డి సంఘ ప్రధాన కార్యదర్శి సందిరి సంజీవ రెడ్డి ,సహాయ కార్యదర్శి ఆసాని బాల్ లింగారెడ్డి,కోశాధికారి దోర్నాల జయరామ్ రెడ్డి, ఎడమల ప్రతాప రెడ్డి, ఆసాని భాస్కర్ రెడ్డి,దోర్నాల చొక్కా రెడ్డి, సందిరి వెంకట్ రెడ్డి,ఎడమల ప్రతాప రెడ్డి,కడారి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 010 ద్వారా వేతనాలు మంజూరు చేయాలి

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**
తంగళ్ళపల్లి మండలంలోని మండేపల్లి ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో 010 పద్దు ద్వారా ప్రతినెలా వేతనాలు ఒకటవ తేదీ నాడు చెల్లించాలని, ప్రమోషన్స్ మరియు ట్రాన్స్ఫర్స్ చేయాలని,హెల్త్ కార్డ్స్, కంపేసినేట్ అపాయింట్మెంట్స్ ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేష్ ఏ.చంద్రశేఖర్,కె.బాలరాజు,జి. అంజయ్య,ఎన్.శోభారాణి,ఎ.రేణుక, ఎ. జ్యోతి,వై. సరిత,ఎన్. ప్రభాకర్, ఎ . శివకుమార్ రెడ్డి ,ఎస్ కవిత, కె. సత్యనారాయణ, పి.నరేందర్ రెడ్డి, జి.జిశ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## 24 నుంచి శ్రీశైలంలో సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలు



**బలగం టీవీ , శ్రీశైలం**
ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 24 నుంచి ప్రఖ్యాత ప్రవాచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మచే ప్రవచనాల కార్యక్రమాన్ని శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానం ఏర్పాటు చేసింది. గణేశ గాథలు అనే అంశంపై ఈ ప్రవచనాలు జరగనున్నాయి మొత్తం 9 రోజుల పాటు జరిగే ఈ ప్రవచనాలు సెప్టెంబర్ 1వ తేదీతో ముగియనున్నాయి.

ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ప్రతిరోజు సాయంత్రం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవచకులు సామవేదం షణ్ముఖ శర్మ పలు పురాణాల్లోని గణపతి ఆవిర్భావ గాథలు, గణపతి తత్త్వం, గణపతి స్వరూపంలోని అంతరార్థాలు, గణపతి మహిమా విశేషాలు, మొదలైన అంశాలను తెలియజేయనున్నారు. ప్రవచనాల్లో సందర్భానుసారంగా శ్రీశైల క్షేత్ర మహిమా విశేషాలను కూడా వివరిస్తారు. కాబట్టి భక్తులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రవచనాలను విని తరించాల్సిందిగా ఆలయ ఈవో పెద్దిరాజు కోరారు.


## కాలువలో పడి గల్లంతయిన బాలిక మృతదేహం లభ్యం..

**బలగం టీవీ , నిజామాబాద్**
నిజామాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ కాలువలో పడిపోయిన బాలిక అను (2) శవమై తేలింది. ఆనంద్ నగర్ కాలనీలోని నాలాలో కొట్టుకు వచ్చిన ఆమె మృతదేహాన్ని డిజాస్టర్ మేనేజ్మెంట్, మున్సిపల్ సిబ్బంది వెలికి తీశారు.దాదాపుగా 12 గంటల పాటు సహాయక చర్యలు కొనసాగినట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మకరంద్ పేర్కొన్నారు.కాగా, స్థానిక వర్ని రోడ్ ప్రాంతంలోని అటవీ కార్యాలయం వద్ద గల నివాస గృహాల ముందు నుంచి పెద్ద మురికి కాలువ ప్రవహిస్తుంది. అదే ప్రాంతంలో నివాసముండే రెండేళ్ల చిన్నారి బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. ఇంట్లో పని ముగించుకుని బయటకు వచ్చిన తల్లి పాప కోసం గాలించగా కనిపించలేదు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో నిండుగా ప్రవహిస్తున్న కాలువలో బాలిక పడిపోయినట్లు గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారమిచ్చింది. డిజాస్టర్ మేనేజ్మెంట్, మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం అను శవమై తేలడం పలువురిని కట్టతడి పెట్టించింది.



## షరతుల్లేని రైతు రుణమాఫీ కావాలంటూ బీఆర్ఎస్ నాయకుల ధర్నా

**బలగం టీవీ , తంగళ్లపల్లి**
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలను రుణమాఫీ చేస్తానని ఇప్పటివరకు కూడా 40శాతం మంది రైతులకు కూడా ప్రయోజనం కలగలేదని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీని గుర్తు చేస్తూ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని తెలిపారు. ధర్నా కార్యక్రమం ఉధృతం కావడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఎస్సై సుధాకర్ ధర్నా స్థలానికి చేరుకొని బి ఆర్ఎస్ నాయకుల ధర్నా కార్యక్రమాన్ని విరమింప జేశారు.ఈ కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎంపీపీ పడిగల మానస, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబింకర్ రాజన్న,ప్యాక్స్ చైర్మన్లు బండి దేవదాస్, కోడూరు భాస్కర్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి,పడిగల రాజు,గణప మదన్,మాట్ల మధు,రాంరెడ్డి, కోడి అంతయ్య,బుస్సా లింగం అడ్డగట్ల భాస్కర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం....

**బలగం టీవీ , సిరిసిల్ల**
తెలంగాణ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పై మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి , బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ జిందం చక్రపాణి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుడూరి ప్రవీణ్ , సెస్ డైరెక్టర్ దర్శం లక్ష్మీనారాయణ , కౌన్సిలర్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..



## రుణమాఫీ చేయకుండా రైతులను ఆగం చేస్తున్న ప్రభుత్వం..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకుల ధర్నా..

**బలగం టీవీ , సిరిసిల్ల :**
కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను ఆగం చేస్తున్నదని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి,ఇప్పుడు రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా, ప్రభుత్వం రైతులను ఆగం చేస్తుందని అన్నారు.తెలంగాణ లో 40శాతం రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ ఆరు గ్యారెంటీలు హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే హామీలను విస్మరించిందని, రైతుభరోసా ద్వారా ఎకరానికి 7500లు ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని అన్నారు.ఎలాంటి ఆంక్షలు లేకుండ రైతులందరికీ వెంటనే 2 లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆంక్షల్లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి..

- బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



**బలగం టీవీ , వేములవాడ**
రైతులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని వేములవాడ బీ ఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రెండు లక్షల రుణమాఫీ చేయాలంటూ వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు రూ 2 లక్షల రుణమాఫీ చేయడంలో ఆంక్షలు విధిస్తూ కాలయాపన చేస్తుందన్నారు.వేములవాడ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాటలు చెబుతున్నారే తప్ప, ఆచరణలో మాత్రం శూన్యమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని క్షుణ్ణంగా పరిశీలించి రైతు రుణ మాఫీ ప్రకటన విషయంలో 49 వేల కోట్లు అవుతుందని ప్రకటించి,తీరా మీడియా సమావేశంలో చాలా సందర్భాల్లో 40 వేల కోట్ల వరకు అవుతుందని చెప్పి,మళ్లీ క్యాబినెట్ సమావేశంలో 31 వేల కోట్లు అవుతుందని... బడ్జెట్లో 25 కోట్లు పెట్టి,చివరికి 17వేల934 కోట్లు రూపాయల రైతు రుణమాఫీ విడుదల చేశారు అని అన్నారు.స్టేట్ లెవెల్ బ్యాంక్ కౌన్సిలింగ్ మీటింగ్ లో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ 17 వేల 934 కోట్లు రైతు రుణమాఫీ విడుదల చేస్తే,రైతన్నలకు చివరికి 7500ల కోట్లు మాత్రమే జమ అయిందని స్వయంగా ఒప్పుకున్నారని ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్షీరాభిషేకలంటూ కాలం గడుపుతున్నారే తప్ప, నియోజకవర్గ రైతన్న ఓట్లతో గెలిచి,వారికి న్యాయం చేయడంలో మాత్రం వెనకబడిపోయారని అన్నారు.నూటికి నూరు శాతం థియరీలో డిస్టింక్షన్ లో పాస్ అవుతున్నారు కానీ, ఆచరణలో మాత్రం శూన్యమని గుర్తు చేశారు.రైతన్న పక్షాన బిఆర్ఎస్ పార్టీ రుణమాఫీ జరిగేంతవరకు పోరాడుతూనే ఉంటుందని సందర్భంగా తెలియజేశారు. బిఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశాలు పెట్టి బిఆర్ఎస్ పార్టీని తిట్టడానికి మాత్రమే సమయం వృధా చేస్తున్నారని,రైతన్న సమస్య తీర్చే మార్గం చూడడం లేదన్నారు. ఎటువంటి అంశాలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, మాజీ జిల్లా జడ్పీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ-రాఘవరెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ తుల ఉమ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, ప్యాక్స్ చైర్మన్లు బండ నరసయ్య, తిరుపతి రెడ్డి, రామ్మోహన్ రావు, కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు మారం కుమార్, సిరిగిరి చందు, నరాల శేఖర్, జోగిని శంకర్, మండల అధ్యక్షులు సత్తిరెడ్డి, మేకల ఎల్లయ్య, గోస్కుల రవి, పట్టణ సీనియర్ నాయకులు పొలస నరేందర్, శ్రీకాంత్ గౌడ్, రవికుమార్, అజిత్ రావు, మాజీ ఎంపీపీలు చంద్రయ్య గౌడ్, గంగం స్వరూప మహేష్, మాజీ జెడ్పిటిసి మ్యాకల రవి,, అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ జెడ్పిటిసిల ప్యాక్స్ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సింపుల్ ప్లాన్‌తో టీ20 వరల్డ్ కప్ గెలిచాం : రాహుల్ ద్రవిడ్



**బలగం టీవీ, ముంబై**

వన్డే వరల్డ్ కప్, టీ20 వరల్డ్ కప్‌కు చేసిన ప్రణాళికల గురించి భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ మాట్లాడాడు. భిన్నంగా ఏదీ ప్రయత్నించలేదని, సింపుల్ ప్లాన్‌తో బరిలోకి దిగామని వివరించాడు. సియెట్ అవార్డుల ప్రదానోత్సవంలో జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకున్న ద్రవిడ్ ఆసక్తిర వ్యాఖ్యలు చేశాడు. నిజాయతీగా చెప్పాలంటే.. టీ20 వరల్డ్ కప్ కోసం భిన్నంగా ఏదీ ప్రయత్నించలేదు. వన్డే వరల్డ్ కప్‌లో మేం అద్భుతంగా ఆడాం. రోహిత్, జట్టు సభ్యులంతా గొప్పగా ఆడారు. ఆ మెగాటోర్నీలో మా ప్రయాణం గొప్పగానే సాగింది. వరుసగా 10 మ్యాచ్‌ల్లో విజయం సాధించి ఆధిపత్యం చెలాయించాలని, దానికి తగ్గట్లుగా ఆడాలని భావించాం. వన్డే వరల్డ్ కప్ ప్లాన్‌ను పొట్టి కప్‌లో మార్చాలనుకోలేదు. సహాయక సిబ్బంది, జట్టు సమావేశాల్లోనూ ఉమ్మడి అభిప్రాయమే వెల్లడైంది. ఎలాంటి మార్పులు వద్దు, చేయాలనుకున్నది సరిగ్గా చేద్దాం అని నిర్ణయించుకున్నాం. అదే ఎనర్జీతో, అదే ఉత్సాహంతో ఆడాలనుకున్నాం. ఇక ఆ రోజు కొంచెం అదృష్టం కూడా కలిగి ఉండాలనుకున్నాం" అని రాహుల్ ద్రవిడ్ పేర్కొన్నాడు. భారత్‌లో జరిగిన వరల్డ్ కప్‌లో ఆటగాడిగా భాగస్వామ్యం కాలేకపోయానని, కానీ కోచ్‌గా పనిచేశానని, ప్రజల నుంచి గొప్ప ప్రేమను పొందానని ద్రవిడ్ అన్నాడు. టీ20 వరల్డ్ కప్ అనంతరం ద్రవిడ్ భారత జట్టు కోచ్ బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.

# సియట్ క్రికెట్ రేటింగ్స్ అవార్డ్స్ 2024

- **క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా రోహిత్**
- **వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్‌గా విరాట్ కోహ్లీ**
- **ద్రవిడ్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు**



**బలగం టీవీ, ముంబై**

ప్రముఖ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ సియట్ (CEAT) క్రికెట్ రేటింగ్స్ అవార్డ్స్ 2024లో ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ఇయర్ అవార్డు దక్కించున్నాడు. స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్, మహ్మద్ షమీ వన్డే బౌలర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కించుకున్నారు. రాహుల్ ద్రవిడ్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకోగా, రవిచంద్రన్ అశ్విన్ టెస్ట్ బౌలర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచాడు.కాగా, సియట్ 26వ ఎడిషన్ అవార్డ్స్ ఈవెంట్ ముంబయిలో బుధ వారం గ్రాండ్‌గా జరిగింది. ఈవెంట్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ, బీసీసీఐ సెక్రటరీ జై షా, ప్లేయర్లు శ్రేయస్ అయ్యర్, మహ్మద్ షమీ పాల్గొన్నారు.

ముంబైలో జరిగిన ఈ అవార్డ్స్ కార్యక్రమంలో భారత క్రికెట్ దిగ్గజాలను సత్కరించారు. వివిధ ఫార్మాట్లలో వారి అద్భుతమైన ప్రదర్శనలను గౌరవిస్తూ, భారత క్రికెట్ దిగ్గజాల అద్భుతమైన విజయాలను జరుపుకుంది.

టీ20 ప్రపంచ కప్ 2024లో జట్టును విజయపథంలో నడిపించిన తర్వాత భారత కెప్టెన్ రోహిత్ శర్మ, పురుషుల అంతర్జాతీయ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికయ్యాడు. వన్డేలు మరియు టీ20లలో 14,846 పరుగులు, మూడు డబుల్ సెంచరీలు, 33 సెంచరీలు మరియు 87 అర్ధసెంచరీలతో, శర్మ సత్తాచాటాడు. అతని కెప్టెన్సీలో భారతదేశం టీ2020 ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది అతను టీ20లలో 49 విజయాలతో ధోని సంఖ్యను అధిగమించి కొత్త రికార్డును నెలకొల్పాడు.



యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ ఐదు మ్యాచ్‌ల్లో 712 పరుగులు చేసి ఇంగ్లండ్‌పై అద్భుతమైన రన్ చేసినందుకు ఈ ఏడాది అత్యుత్తమ టెస్ట్ బ్యాటర్‌గా అవార్డును అందుకున్నాడు. మహ్మద్ షమీ 2023 వన్డే ప్రపంచకప్‌లో 24 వికెట్లు తీసి అత్యుత్తమ వన్డే బౌలర్‌గా గుర్తించబడ్డాడు.

విరాట్ కోహ్లి అద్భుతమైన ఆటతీరుతో 13,906 పరుగులతో ఆ సంవత్సరపు అత్యుత్తమ వన్డే బ్యాటర్‌గా నిలిచాడు. ద్రవిడ్‌ను లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించగా, రవిచంద్రన్ అశ్విన్ టెస్ట్ బౌలర్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రశంసలు అందుకున్నాడు, ఇంగ్లండ్ పర్యటనలో 26 వికెట్లతో ఆధిపత్యం చెలాయించాడు.

ఐపీఎల్‌లో, కోల్‌కతా నైట్ రైడర్స్‌ను వారి మూడవ టైటిల్‌కు నడిపించినందుకు అత్యుత్తమ నాయకత్వానికి శ్రేయాస్ అయ్యర్‌కు అవార్డు లభించింది. టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్‌లో కోహ్లి, పాండ్యా, బుమ్రాల అద్భుతమైన ప్రదర్శనతో దక్షిణాఫ్రికాపై భారత్ నాటకీయ విజయాన్ని సాధించింది.

# ప్రపంచకప్ గెలవడంలో ముగ్గురి పాత్ర కీలకం



- **టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ**

**బలగం టీవీ, ముంబై**

భారత క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ గెలువడంలో ఆ ముగ్గురి పాత్ర కీలకమని కెప్టెన్ రోహిత్‌శర్మ అన్నారు. బుధవారం జరిగిన సీయెట్ కంపెనీ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రోహిత్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచాడు. 17ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ గెలిచిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నాడు. మెగాటోర్నీ గెలువడంలో అప్పటి చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, బోర్డు కార్యదర్శి జై షా ముగ్గురు మూడు పిల్లర్ల వలే వ్యవహరించారని చెప్పారు. ఈ ముగ్గురి వల్లనే ఐసీసీ ట్రోఫీ కల సాకారమైందన్నాడు.

ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కించుకున్న రోహిత్ మాట్లాడుతూ 'గణాంకాలు, ఫలితాల గురించి పెద్దగా ఆలోచించలేదు. అతిగా ఆలోచించకుండా ఎవరి పాత్ర వారు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నాం.ఇందుకు జైషా, ద్రవిడ్, అగార్కర్ నుంచి నాకు పూర్తి సహకారం లభించింది. దీనికి తోడు ప్లేయర్లందరూ సమిష్టిగా రాణించడం కలిసివచ్చింది. దశాబ్ద కాలంగా ఐసీసీ ట్రోఫీ కల నెరవేరలేదన్న బాధ ప్రతీరోజు వేధిస్తుండేది. కానీ ప్రపంచకప్ గెలిచిన తర్వాత ప్రతీ సందర్భాన్ని ఆస్వాదించాలనుకున్నాం. అందుకు తగ్గట్లు దేశం మొత్తం సంబురాల్లో భాగం కావడం జీవితంలో మరిచిపోలేనిది. అది మాటల్లో వర్ణించలేము. బ్యాట్ల ఎంపిక విషయంలో నేను పెద్దగా ఆలోచించను. బాగుందనుకుంటే ఆడేస్తాను. విజయం రుచి తెలిసిన తర్వాత దాన్నుంచి బయటపడలేం. రానున్న రోజుల్లో కీలకమైన సిరీస్‌ల్లో ఆడాల్సి ఉంది' అని అన్నారు. ఇదిలా ఉంటే కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, షమీ, ద్రవిడ్, హర్మన్‌ప్రీత్‌కౌర్, దీప్తిశర్మ అవార్డులు అందుకున్నారు.

# బ్యాటర్ల అతివిశ్వాసం వల్లే శ్రీలంక చేతిలో ఓడాం

- **టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటె**



**బలగం టీవీ, ముంబై**

ఇటీవల శ్రీలంకలో పర్యటించిన టీమిండియా మూడు వన్డేల సిరీస్‌ను 0–2తో కోల్పోయింది. పటిష్టమైన భారత జట్టు బలహీనమైన శ్రీలంక చేతిలో ఓటమిపాలవ్వడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే లంక చేతిలో వన్డే సిరీస్ ఓటమికి గల కారణాలను టీమిండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటె తాజాగా వివరించాడు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పిచ్‌లపై ఎక్కువగా దృష్టిసారించడం, స్పిన్ పిచ్‌లో సత్తాచాటుతామనే భారత బ్యాటర్ల అతివిశ్వాసమే శ్రీలంక చేతిలో ఓటమికి కారణమయ్యాయని డస్కాటె పేర్కొన్నాడు. ఈ విషయంలో జట్టుతో కలిసి పనిచేస్తానని, స్పిన్‌లో ప్రపంచ అత్యుత్తమ బ్యాటర్లుగా భారత ప్లేయర్ల అనే పేరును కొనసాగాలేలా తీర్చిదిద్దుతానని పేర్కొన్నాడు. "ఫిబ్రవరిలో ఛాంపియన్స్ ట్రోఫీ ఉంది. ఈ మెగాటోర్నీ ప్రిపరేషన్‌కు మూడు వన్డేలు మాత్రమే ఉన్నాయి. ఓ ఫార్మాట్ నుంచి మరో ఫార్మాట్‌కు మారడం, దానికి జట్టును సిద్ధం చేయడం సవాలుగా ఉంటుంది. అయితే విజయాలు సాధించాలని టీమిండియా పట్టుదలతో ఉంది. ప్రస్తుతం వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించడంపై దృష్టి సారించాం. దాని కోసం మరో 10 టెస్టులు మిగిలిఉన్నాయి. స్వదేశంలో అయిదు, ఆస్ట్రేలియాలో మరో అయిదు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇది ఆసక్తికరంగా సాగుతుంది""ఇక శ్రీలంక పర్యటనలో మా ప్రదర్శన సంతృప్తికరంగా లేదు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో ఉన్న పేస్ పిచ్‌లపైనే టీమిండియా ఆలోచనంతా ఉంది. అక్కడ మెరుగ్గా రాణించడంపై ఫోకస్ చేస్తున్నారు. మరోవైపు స్పిన్ ఎదుర్కోవడం మన బలమే కదా అనే భావన జట్టులో ఉంది. అయితే ఈసారి ఫలితం అనుకూలంగా రాలేదు. దీనిపై జట్టుకు సాయం చేయడానికి ప్రయత్నిస్తాను. స్పిన్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లు టీమిండియా ప్లేయర్లే అనే పేరును నిలబెట్టుకునేలా కృషి చేస్తాను" అని ర్యాన్ టెన్ డస్కాటె పేర్కొన్నాడు.

# లయన్ కింగ్‌కు మహేష్‌బాబు వాయిస్ ఓవర్



**బలగం టీవీ, హైదరాబాద్**

వాల్ట్ డిస్నీ రూపొందించిన 'ది లయన్ కింగ్' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమాగా 'ముఫాసా: ది లయన్ కింగ్' డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. పలు భారతీయ భాషల్లో కూడా ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు వెర్షన్ ముఫాసా పాత్రకు అగ్ర హీరో మహేష్‌బాబు వాయిస్ ఓవర్ అందిస్తున్నారు. తెలుగు ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేయబోతున్నారు. ముఫాసా పాత్రకు డబ్బింగ్ చెప్పడం పట్ల మహేష్‌బాబు ఆనందం వ్యక్తం చేశారు.తన కుటుంబంతో కలిసి ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే మూమెంట్ ఇదని అన్నారు. ఆయన మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ చిత్రాల్లోని ఎంటర్‌టైన్‌మెంట్, స్టోరీటెల్లింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అడవికి రారాజైన ముఫాసా పాత్రకు వాయిస్ అందించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను అందరూ ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా' అన్నారు. తెలుగు వెర్షన్‌కు మహేష్‌బాబు వాయిస్ ఓవర్ జీవం పోసిందని డిస్నీస్టార్ స్టూడియోస్ హెడ్ బిక్రమ్ దుగ్గల్ అన్నారు. ఈ చిత్రానికి బారీజెంకిన్స్ దర్శకత్వం వహించారు.

# విశ్వంభర ఫస్ట్ లుక్ విడుదల

- **త్రిశూలాన్ని చేతపట్టుకున్న చిరంజీవి**

**బలగం టీవీ, హైదరాబాద్**

చిరంజీవి ప్రస్తుతం టైటిల్ రోల్‌లో నటిస్తున్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర ). నేడు చిరుకు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ విశ్వంభర నుంచి కొత్త పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నాడు అతీత శక్తులతో నిండిపోయిన త్రిశూలాన్ని చేతపట్టుకున్న చిరంజీవి లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో త్రిష ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నండూరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే పాపులర్ యాక్షన్ కొరియోగ్రఫర్ అన్లరసు పర్యవేక్షణలో విశ్వంభరలో వచ్చే హై ఆక్టేన్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ కొనసాగుతున్నట్టు మేకర్స్ తెలియజేశారని తెలిసిందే. యాక్షన్ సీక్వెన్స్ కోసం సెట్స్‌లోకి ఎంటరైన విజువల్స్ వీడియోను మేకర్స్ షేర్ చేయగా.. నెట్టింట చక్కర్లు కొడుతోంది.ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఆర్‌ఆర్‌ఆర్ ఫేం లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు.

